సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం । 7 । జూలై । 2023



ఫ్లెక్సీల హోరు..

జడ్చర్ల మున్సిపాలిటీలో అనుమతి లేకుండా భారీ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి.

వివరాలు 8లో ▸



కాలుష్యం వల్లే రోగాలు

పరిశ్రమల కాలుష్యం వల్లే రోగాల బారిన పడుతున్నామని ప్రజలు అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /22.0

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని బీఈడీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్టు లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, సాంఘికశాస్త్రం, వ్యాయామ విద్య, ఫిలాసఫీ, విజువల్ ఆర్ట్ పర్ఫామింగ్ ఒక్కొక్క పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రిటైర్డ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కొత్తవారు ఇందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 10లోగా ప్రభుత్వ బీఈడీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హాస్టళ్లలో ఏఎన్ఎంల భర్తీకి..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని 8 గిరిజన హాస్టళ్లలో పనిచేయడానికి ఏఎన్ఎంల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్టీ సంక్షేమశాఖ అధికారి ఛత్రునాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 44 ఏళ్లలోపు వారు అర్హులని, ఆసక్తి గలవారు ఈ నెల 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

8న టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓనర్స్ పరీక్ష

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఈ నెల 8న టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓనర్స్ పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుందని అదనపు కలెక్టర్ సీతారామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9.30 గంటలలోపు, మధ్యాహ్నం 2 గంటలలోపు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్ వద్ద జేపీఎన్‌సీ కళాశాల, మున్సిపాలిటీ పరిధిలోని క్రిష్టియన్‌పల్లి వద్ద ఫాతిమా విద్యాలయంలో ఎంఎస్ ఎస్‌ఫో టెక్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

పుణ్యక్షేత్రాలకు బస్సులు నడపండి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలోని భక్తుల సౌకర్యార్థం పుణ్యక్షేత్రాలు, దూర ప్రాంతాలకు బస్సులు నడపాలని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు జగపతిరావు, నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లా నుంచి తిరుపతి, గుంటూరు సర్వీసులు మాత్రమే నడుస్తున్నాయని, కర్ణాటక రాష్ట్రంలోని కుక్కే సుబ్రమణ్యంస్వామి క్షేత్రానికి, మహారాష్ట్రలోని శిరిడీ, కొల్హాపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, అన్నవరం, సింహాచలం, కాణిపాకం, తమిళనాడు వేలూరు గోల్డెన్ టెంపుల్‌కు వారానికి కనీసం రెండు సార్లు అయినా బస్సులు నడపాలని కోరారు.

వేరుశనగ @ రూ.7,520

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,520, కనిష్టంగా రూ.7,390 ధరలు లభించాయి.

పోడు.. పట్టని గోడు



కొత్తచెర్వుతండా సమీపంలో పోడు భూములను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పాలమూరు రైతులకు అందని ద్రాక్షగా ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు

- మార్గదర్శకాలంటూ దరఖాస్తుల తిరస్కరణకే మొగ్గు
- 4,528 అర్జీల్లో ఆమోదించినవి 19 మాత్రమే..
- అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయ లోపమే కారణం
- త్వరలో పట్టాల పంపిణీకి సన్నాహాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తాము సాగు చేసుకుంటున్న భూములపై పూర్తిస్థాయి హక్కులు కల్పించాలని అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని రైతులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. నిత్యం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి వినతిపత్రాలు సమర్పించడంతోపాటు తమ హక్కుల కోసం పలు దఫాలుగా ఆందోళనలు చేపట్టారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించి పోడు భూములకు హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల అనంతరం పోడు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించడంతో ఆయా రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎట్టకేలకు జిల్లాలో పోడు పట్టాల పంపిణీకి సిద్ధం కాగా.. ఎన్నో ఆశలతో ఉన్న సదరు రైతాంగానికి నిరాశే ఎదురైంది. 4,528 మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే 19 మాత్రమే ఆమోదానికి నోచుకోవడంతో వారు నివ్వెరపోతున్నారు. పోడు భూములకు హక్కులు కల్పించే విషయంలో పరిశీలన తూతూమంత్రంగా కొనసాగగా.. పరిష్కారంలో మమ అనిపించారని వాపోతున్నారు.

ప్రస్తుతం కాస్తులో ఉన్నవారికే..

పోడు భూముల పట్టాలకు సంబంధించి జిల్లాలోని 110 హ్యాబిటేషన్ గ్రామాల పరిధిలో 4,528 మంది రైతులు 7,543.66 ఎకరాల విస్తీర్ణానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 2,007 మంది ఎస్టీలు 3,150.37 ఎకరాలు, ఇతరులు 2,521 మంది 4,393.29 ఎకరాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 114 మంది ఎస్టీ రైతులు 110.11 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం కాస్తులో ఉంటూ సాగు చేసుకుంటున్న వారికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చేందుకు సబ్‌డివిజన్ స్థాయి కమిటీకి సిఫార్సు చేశారు. అక్కడ పరిశీలన అనంతరం కేవలం 19 మంది ఎస్టీ రైతులకు 13.02 ఎకరాల విస్తీర్ణానికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేయాలని జిల్లాస్థాయి కమిటీ ఆమోదించింది. ఇందులో హన్వాడ మండలానికి చెందినవి 18 దరఖాస్తులు ఉండగా.. నవాబ్‌పేటకు సంబంధించి ఒక దరఖాస్తుకు ఆమోదం లభించింది. అలాగే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోసం చేసిన దరఖాస్తుల్లో రెండింటికి (7.23ఎకరాలు) మాత్రమే ఆమోదం లభించినట్లు రికార్డులు చెబుతున్నాయి.

స్పష్టత లేకపోవడమేనా..?

రెవెన్యూ, అటవీ భూముల విషయంలో ఆయా శాఖలకు స్పష్టత లేకపోవడం పోడు రైతుల సమస్యలకు పరిష్కారం చూపలేకపోయినట్లు తెలుస్తోంది. దీనిపై జిల్లాకు చెందిన పలువురు రైతులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కేసులు వేశారు. తమకు న్యాయం చేయాలని కోరగా.. రెవెన్యూ, అటవీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని కోర్టు ఆదేశించినా.. ఫలితం లేకపోయింది. ఒకటి, రెండు గ్రామాల్లో జాయింట్ సర్వేలు నిర్వహించినా రెవెన్యూ మిగులు భూముల విషయంలో క్లారిటీ రాలేదు. ఫలితంగా లావుణి పట్టాదారులు, పోడు భూములు సాగుచేసుకుంటున్న రైతులు హక్కులు పొందలేకపోతున్నారు.

ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు వచ్చిన దరఖాస్తులు

అటవీ సరిహద్దు గ్రామాలు **110**

మొత్తం దరఖాస్తులు **4,528**	దరఖాస్తుల ప్రకారం విస్తీర్ణం (ఎకరాలు) **7,543.66**
ఇందులో ఎస్టీల అర్జీలు **2,007**	ఎంత విస్తీర్ణం అంటే.. (ఎకరాలు) **3,150.37**
ఇతర రైతుల దరఖాస్తులు **2,521**	ఎంత విస్తీర్ణం అంటే.. (ఎకరాలు) **4393.29**
జిల్లా స్థాయిలో ఆమోదించినవి **19**	ఎంత విస్తీర్ణం అంటే.. (ఎకరాలు) **13.02**

చట్టం-2006 ఏం చెబుతోందంటే..

- దరఖాస్తు చేసుకున్న భూమి అటవీ భూమి అయి ఉండాలి.
- సదరు గ్రామంలో దరఖాస్తుదారు నివాసముంటున్నట్లు గుర్తింపు ఉండాలి.
- అటవీ భూమిలో గిరిజన తెగల వారైతే 35 ఏళ్లు, ఇతరులు 92 ఏళ్ల కాస్తులో ఉండాలి. కాస్తు చేసుకుంటున్నట్లు ఆధారాలు (ఫారెస్ట్ అధికారులు పెట్టిన కేసులు, ఇతర పంచనామాలు వంటివి) సమర్పించాలి.
- కాస్తులో ఉన్నట్లు చట్టుపక్కల రైతుల ద్వారా పంచనామా లేదా చెట్లు, బావులు, పెద్దల సమాధులను పరిగణలోకి తీసుకోవాలి.
- లబ్ధిదారు సాగు చేసుకుంటున్న పోడు భూమితో కలిపి 10 ఎకరాల విస్తీర్ణం మించకుండా ఉండే ప్రతి దరఖాస్తుదారుడిని అర్హుడిగా పరిగణించాలి.
- గ్రామస్థాయిలో అటవీ హక్కుల కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి సబ్ డివిజన్ స్థాయి కమిటీకి పంపుతూ హక్కుల మంజూరుకు జిల్లాస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలి.

మాకు న్యాయం చేయండి..



మా తాతలకాలం నుంచి అటవీ భూములు సాగుచేసుకుంటున్నాం. భూప్రక్షాళనలో సొంత పట్టా భూములనూ తొలగించారు. ఇదేమని అడిగితే అవి అటవీ సర్వే నంబర్లు అంటున్నారు. పెద్దదర్పల్లి రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్లు 2, 6, 7, 8లలో దాదాపు 25ఎకరాలు కోల్పోయాం. గతంలో కలెక్టర్‌ను కలవగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి కాస్తులో ఉన్నట్లు పంచనామా చేశారు. దీని ఆధారంగానైనా హక్కులు కల్పించాలి. – తార్యానాయక్, కొత్తచెర్వుతండా

ముందుగా హద్దులు తేల్చాలి..



గ్రామస్థాయిలో కమిటీలు వేసి పోడు భూముల లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ చేపట్టలేదు. అటవీ హక్కుల చట్టం–2006 ప్రకారం ఆక్రమణలో ఉన్న భూమికి సంబంధించి అందుబాటులో ఉన్న ఆధారాలు స్వీకరించాలి. చట్టంలో పొందుపర్చిన అంశాలపై ఫారెస్ట్, రెవెన్యూ శాఖలు పూర్తిస్థాయి అవగాహనతో నిర్ణయం తీసుకుంటేనే న్యాయం జరుగుతుంది. రెవెన్యూ, అటవీ భూముల హద్దులపై స్పష్టత లేకుండా దరఖాస్తులకు న్యాయం జరగదు. – నాగన్న, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు

మార్గదర్శకాల ప్రకారమే..

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే పోడు భూముల (ఆర్వోఎఫ్ఆర్) పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 19 మందికి మాత్రమే జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. వీరికి త్వరలోనే పట్టాలు అందజేస్తాం. – ఛత్రునాయక్, డీటీడీఓ

క్రీడా ప్రాంగణాలకు స్థలాలు గుర్తించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు స్థలాల కొరత ఉన్న చోట వెంటనే గుర్తించి మైదానాలు పూర్తిచేయాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 58, 59 కింద వచ్చిన దరఖాస్తుల విచారణ కోసం బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ ఇళ్ల పట్టాల పంపిణీకి సంబంధించిన సంక్షేమ దినోత్సవం రోజు కొన్ని పట్టాలు పంపిణీ చేసినా.. మిగతా వాటిని సంబంధిత ప్రజాప్రతినిధుల సూచన మేరకు వారంలోగా పంపిణీ చేయాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో, ఫారం 6, 7, 8 తదితర ఫారాలన్నింటిని పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ధరణి సమస్యల పరిష్కారం, ఇసుక అక్రమ రవాణాపై విధించిన జరిమానాలు, ప్రజావాణి, ఈ ఆఫీస్ ఫైళ్ల పెండింగ్ తదితర అంశాలపై సమీక్షించారు.

అవార్డులు పాస్ చేయాలి

పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద ఉదండాపూర్ రిజర్వాయర్ ఆర్అండ్ఆర్ పరిధిలోని నిర్మాణాలకు సంబంధించిన అవార్డులను త్వరగా పాస్ చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ పనులపై నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ఇంజినీరింగ్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు అవార్డులు పాస్ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, ఆర్అండ్ఆర్ డైరెక్టర్ రూపస్‌దత్తం, ఓఎస్డీ మనోహర్, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీఓ అనిల్‌కుమార్, జడ్చర్ల తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

17 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

- 9 మంది ఏఎస్‌ఐలకు పదోన్నతి



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న 17 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ గురువారం జోగుళాంబ 7వ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే మూడుసార్లు ఎస్‌ఐలకు స్థానచలనం కల్పించగా.. తాజాగా నాలుగోసారి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎస్‌ఐలను బదిలీ చేయడం జరిగింది.

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని తొమ్మిది మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతులు కల్పిస్తూ జోగుళాంబ గద్వాల 7వ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన ఎస్‌ఐలకు వేరే స్థానాల్లో పోస్టింగ్ కల్పించారు.

ఎస్‌ఐ	ప్రస్తుతం స్థానం	బదిలీ స్థానం
ఎన్.రామకృష్ణ	వన్‌టౌన్, మహబూబ్‌నగర్	సీసీఎస్, మహబూబ్‌నగర్
జి.బాలకృష్ణగౌడ్	వన్‌టౌన్, మహబూబ్‌నగర్	సీసీఎస్, మహబూబ్‌నగర్
ఎ.విజయ్‌కుమార్	వీఆర్, మహబూబ్‌నగర్	ఎస్‌ఐ-2, రూరల్ పీఎస్
కె.గోకారి	వీఆర్, మహబూబ్‌నగర్	సీసీఎస్, ఎంబీఎన్ఆర్ అటాచ్ రూరల్
ఎస్ఎం నవీద్	వీఆర్, మహబూబ్‌నగర్	ఎస్‌ఐ-1, వన్‌టౌన్
సుధామాధురి	వీఆర్, మహబూబ్‌నగర్	ఎస్‌ఐ-2, వన్‌టౌన్
ఆలె నాగరాజన్	వీఆర్, మహబూబ్‌నగర్	ఎస్‌ఐ-1, టూటౌన్
కె.సుజాత	వీఆర్, మహబూబ్‌నగర్	ఎస్‌ఐ-2, టూటౌన్
చంద్రమోహన్‌రావు	వీఆర్, మహబూబ్‌నగర్	అటాచ్, జడ్చర్ల
పి.శ్రీనివాసులు	వీఆర్, మహబూబ్‌నగర్	సీసీఎస్, అటాచ్ రూరల్ పీఎస్
జి.రాఘవేందర్	వీఆర్, మహబూబ్‌నగర్	ఎస్‌ఐ-2, మహ్మదాబాద్, అటాచ్ ఐటీసెల్
ఎం.స్వాతి	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్	ఉమెన్ పీఎస్
ఎండీ అఫ్జల్	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్	ఉమెన్ పీఎస్
ఎస్.బాల్‌రెడ్డి	ఉమెన్ పీఎస్	పీసీఆర్, మహబూబ్‌నగర్
బి.సుజాత	ఉమెన్ పీఎస్	వీఆర్, ఎంబీఎన్ఆర్ అటాచ్ కోర్టు మానిటరింగ్ సిస్టం
సీహెచ్ శ్రీకాంత్	టూటౌన్	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్
జి.భాస్కర్‌రెడ్డి	భూత్పూర్ అటాచ్, డీఎస్‌బీ	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్

పదోన్నతులు

ఎస్‌ఐ పేరు	ప్రస్తుత స్థానం	కేటాయించిన స్థానం
డి.వేమన్న	నాగర్‌కర్నూల్	వనపర్తి
సి.ఇందిరమ్మ	నాగర్‌కర్నూల్	వనపర్తి
ఎండీ నయీం	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్
శివయ్య	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్
రాంచందర్‌జీ	గద్వాల	నాగర్‌కర్నూల్
సయ్యద్ నజీముద్దీన్ ఖాద్రీ	మహబూబ్‌నగర్	నారాయణపేట
జక్కిబాబు	గద్వాల	మహబూబ్‌నగర్
వి.ఆచారి	నాగర్‌కర్నూల్	నారాయణపేట
కె.గోపాల్‌నాయక్	మహబూబ్‌నగర్	వనపర్తి


డెంగీ.. దడ

వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధుల ముప్పు

- ఈ ఏడాది ఇప్పటికే 48 మందికి డెంగీ నిర్ధారణ
- తాజాగా జమిస్తాపూర్‌లో ఇద్దరికి పాజిటివ్.. ఒక పాప మృతి
- యాంటీ లార్వాపై దృష్టిపెట్టిన మలేరియా విభాగం
- క్షేత్రస్థాయిలో గుర్తింపు కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు

'వారం రోజుల కిందట మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్‌లో ఇద్దరికి డెంగీ పాజిటివ్ రాగా.. చికిత్స పొందుతూ ఒక మృత్యువాతపడింది. అలాగే ఈ ఏడాది ఆరు నెలల్లోనే 2,619 మంది అనుమానితులకు రక్త పరీక్షలు చేయగా.. 48 మందికి నిర్ధారణ అయ్యింది. ఈ మాత్రం లెక్కలు చాలు డెంగీ విజృంభణ ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఈ ముప్పు మరింత పొంచి ఉందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.'

పాలమూరు: వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ముఖ్యంగా పారిశుద్ధ్య లోపంతో వ్యాధులు విజృంభిస్తాయి. ఈ క్రమంలో ముందు జాగ్రత్తలు పాటించకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక బృందాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గత నెల 13 నుంచి 27 వరకు అతిసారం నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహించి ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు పంపిణీ చేశారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి పీహెచ్‌సీ పరిధిలో రసాయనాలను పిచికారీ చేస్తున్నారు. మరోవైపు ఐదేళ్లలోపు చిన్నారులు అతిసారం బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



జమిస్తాపూర్‌లో వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

అపరిశుభ్ర వాతావరణంలో..

వర్షాకాలంలో దోమల బెడద అధికంగా ఉంటుంది. ప్రధానంగా అపరిశుభ్ర పరిసరాలు, ఓపెన్ నాలాలు, మురుగు నిల్వ ఉన్నచోట దోమలు పెరగడానికి అవకాశం ఎక్కువ. జిల్లాలో 2021లో 3,633 మంది అనుమానితులకు డెంగీ పరీక్షలు నిర్వహించగా ఇందులో 453 మందికి పాజిటివ్ వచ్చింది. 2022లో 4,208 మందికి పరీక్షలు చేయగా 255 మందికి నిర్ధారణ అయ్యింది. ఈ ఏడాది జనవరి నుంచి జూలై 4 వరకు 2,619 మందికి డెంగీ పరీక్షలు చేయగా 48 మందికి పాజిటివ్ వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈసారి డెంగీ కేసులు పెరగవచ్చు. ప్రస్తుతం వస్తున్న కేసుల్లో అధికంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని వీరన్నపేట, శివశక్తినగర్, టీడీగుట్ట, బీకేరెడ్డికాలనీ, షాసాబ్‌గుట్ట ఏరియాల్లో డెంగీ కేసులు అధికంగా వస్తున్నాయి. నవాబ్‌పేట, జడ్చర్ల మండల పరిధిలోనూ ఎక్కువే ఉంటున్నాయి.

రెండు రోజుల్లో..

జిల్లాలో సీజనల్ వ్యాధుల కట్టడి కోసం కలెక్టర్ రవినాయక్ అధ్యక్షతన రెండు రోజుల్లో కలెక్టరేట్‌లో సీజనల్ వ్యాధుల సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఇందులో వైద్య, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్లు, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, జెడ్పీ, మిషన్ భగీరథ, డీఈఓ, డీఆర్డీఓ, డీడబ్ల్యూఓ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శాఖల అధికారులతో ఈ సమావేశం కొనసాగనుంది. వ్యాధుల కట్టడి కోసం క్షేత్రస్థాయిలో తీసుకునే అంశాలపై నిర్ణయం జరగనుంది.

గత ఐదేళ్లలో డెంగీ కేసుల నమోదు ఇలా..

ఏడాది	శాంపిల్స్	పాజిటివ్
2019	4,090	886
2020	796	113
2021	3,633	453
2022	4,208	255
2023	2,619	48

ముందస్తు జాగ్రత్తలతో..



వాతావరణ మార్పులతో ఒక్కసారిగా రోగుల తాకిడి పెరిగింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రోగాల బారిన పడకుండా చూసుకోవచ్చు. ప్రధానంగా వర్షకాలంలో నీటి కాలుష్యం ఎక్కువ. పిల్లలకు, వృద్ధులకు, గర్భిణులకు కాచి వడబోసిన నీటినే తాగించాలి. మరుగుదొడ్లు వినియోగించిన తర్వాత కాళ్లు, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. ఈ కాలంలో డీప్తీరియా వచ్చే అవకాశాలు ఎక్కువ. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడే తినేయాలి. ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా, ఇంటి చుట్టూ వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలి. చిన్నపాటి జ్వరం, జలుబుకు పిల్లలకు యాంటీబయోటిక్స్ ఇవ్వకూడదు. వైద్యుల సూచన మేరకే మందులు వేసుకోవాలి. – డాక్టర్ బాలశ్రీనివాస్, జనరల్ ఫిజిషియన్, జనరల్ ఆస్పత్రి

యాంటీ లార్వాలపై దృష్టి



జిల్లాలో సీజన్ వ్యాధులను అరికట్టడానికి ప్రధానంగా యాంటీ లార్వాలపై దృష్టిపెట్టాం. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నాం. కేసులు నమోదవుతున్న గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సర్వే చేసి రక్త నమూనాలు సేకరిస్తున్నాం. అంగన్‌వాడీలు, ఆశలు, ఏఎన్ఎంల ద్వారా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. జనరల్ ఆస్పత్రిలో డెంగీ కిట్లు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారికి అక్కడ పరీక్షలు చేయించడం జరుగుతుంది. – డాక్టర్ శ్వేతారెడ్డి, జిల్లా మలేరియా అధికారి

ఆందోళన బాటలో పీఏసీఎస్ ఉద్యోగులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బందికి జీఓ 44 ప్రకారం చెల్లిస్తున్న విధంగా మహబూబ్‌నగర్ జిల్లాలో వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ జిల్లాలోని పీఏసీఎస్ ఉద్యోగులు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ జీఓ 44 ప్రకారం గతేడాది డిసెంబర్ 17న జీఓ విడుదల చేసినా ఇప్పటి వరకు జిల్లాలో సహకార అధికారి ఇచ్చిన వేతనాల ప్రొసీడింగ్స్ ప్రకారం తమకు వేతనాలు చెల్లించడం లేదని పీఏసీఎస్ ఉద్యోగుల యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీల సేవింగ్స్ ఖాతాల్లో డబ్బులు నిల్వ ఉన్న కూడా వేతనాలు విత్‌డ్రా చేసేందుకు బ్యాంకుల మేనేజర్లు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మేనేజర్లకు సొసైటీ మార్జిన్ అకౌంట్‌లో మార్జిన్ అమౌంట్ డిపాజిట్ చేసేందుకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు వేతనాలు చెల్లింపు విషయంలో వెంటనే స్పందించి బ్రాంచి మేనేజర్లకు చెల్లింపు విషయమై ఆదేశాలు ఇవ్వాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తూ నాయకులు డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, బ్యాంకు సీఈఓ లక్ష్మయ్యలను గురువారం కలిసి వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు.

క్లుప్తంగా

చేపల వలలో చిక్కుకొని వ్యక్తి మృతి


బాలయ్య (ఫైల్)

కోడేరు: కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లి ఓ వ్యక్తి వలలో చిక్కుకొని మృతి చెందిన సంఘటన మండలంలోని పస్పుల గ్రామ శివారులో గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం దేవల్‌తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మరుగని బాలయ్య(51) బుధవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో చేపలు పట్టేందుకు వెళ్తునట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం 5గంటలైనా తిరిగి రాలేదు. గురువారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో వెతికారు. ఈ క్రమంలో కోడేరు మండలం పస్పుల శివారులోని ఎర్రకుంటలో అతని మృతదేహం కనిపించింది. ఈ విషయం పోలీసులకు తెలియడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. అతనికి భార్య ఇందిరమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్..



గోపాల్‌పేట: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. చెన్నూరు గ్రామానికి చెందిన రాములు (33) గోపాల్‌పేటలో ట్రాక్టర్ డ్రైవర్‌గా ఏడాది నుంచి పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ట్రాక్టర్ ఇంజన్‌కు రోటవేటర్ తగిలించుకుని చెన్నూరు వైపు వెళ్లాడు. గోపాల్‌పేటలో బండి పెట్టేందుకు తిరుగుప్రయాణం కాగా, గోపాల్‌పేట ఊరిబయట మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో రాములు ట్రాక్టర్ కింద పడి మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అతనికి భార్య సుజాత, ఐదేండ్ల కుమారుడు ఉన్నాడు.

ఆర్టీసీ బస్సు కిందపడి యాచకురాలు..

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సు కిందపడి యాచకురాలు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన షేక్ హుసేన్ బీ (55) బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. ఆమె ఆర్టీసీ బస్టాండ్ ముందు నుంచి వెళ్తుండగా మహబూబ్‌నగర్ నుంచి వచ్చిన బస్సు బస్టాండ్‌లోకి వెళ్తూ ఆమెను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. యాచకురాలి మనవడు మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వృద్ధురాలు..

పెబ్బేరు రూరల్: బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో ఓ వృద్ధురాలు మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బాలమ్మ(65) ఉదయం కొడుకు కృష్ణయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై శ్రీరంగనాథస్వామి ఆలయానికి వెళ్తుండగా మార్గమధ్యలో బైక్‌పై నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందింది. ఈ ఘటనపై బాలమ్మ భర్త బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి..


మౌనిక(ఫైల్)

వెల్దండ: చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండల పరిధిలోని పోషమ్మగడ్డతండాకు చెందిన వడ్యావత్ పాండు, శాంతిలు నలుగురు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోని బాలానగర్‌కు వలస వెళ్లారు. కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగించేవారు. ఈనెల 1న చిన్న కూతురు వడ్యావత్ మౌనిక(20) ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోల్ పోసుకోని నిప్పంటించుకోని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమెను ఉస్మానియ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐదు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆమెను స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ఫ్లెక్సీల హోరు.. ప్రజల బేజారు

- జాడ లేని అనుమతులు
- ఎక్కడబడితే అక్కడ ఏర్పాటు
- మున్సిపాలిటీ ఆదాయానికి గండి


జడ్చర్ల క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలో తెల్లారేసరికి ఎక్కడికక్కడ భారీ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ఏ చౌరస్తాలో చూసినా రోడ్ల వెంట పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. సదరు ఫ్లెక్సీలను సక్రమంగా పూర్తి రక్షణగా ఏర్పాటు చేయకపోవడంతో గాలి దుమారానికి ఎగిరిపోవడం, విరిగిపోవడంతో అవి రోడ్లపై వెళ్తున్న వారిపై పడుతున్నాయి. నిత్యం వందల సంఖ్యలో వెలుస్తున్న భారీ ఫ్లెక్సీల నియంత్రణకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవడం లేదు.

జాడ లేని అనుమతులు

ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేయాలనుకునే వారు ముందస్తుగా మున్సిపాలిటీ, పంచాయతీ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఎవరూ అనుమతులు తీసుకోకుండానే ఇష్టానుసారం ఏర్పాటు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో నిర్ణీత రుసుము చెల్లించి, ఫ్లెక్సీ కొలతలతో పాటు ఏర్పాటు చేయదలచిన ప్రదేశం, ఎన్నిరోజుల పాటు అక్కడ ఉండాల్సిన గడువును పేర్కొంటూ స్థానిక మున్సిపల్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించి అధికారులు అనుమతి ఇవ్వాల్సి ఉండగా ఎవరూ అనుమతులు తీసుకోవడం లేదు.

ఫ్లెక్సీల చాటున మహనీయుల విగ్రహాలు

ప్రధానంగా చౌరస్తాలలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో గజిబిజిగా మారాయి. మహనీయుల విగ్రహాలు ఉన్నా ఫ్లెక్సీల పుణ్యమా అవి కనిపించకుండా పోతున్నాయి. కొత్త వారు వస్తే తాము ఏ చౌరస్తాలో ఉన్నామో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

ఆదాయానికి గండి

ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసే వారు నిర్ణీత రుసుము చెల్లించి అనుమతులు తీసుకోకపోవడంతో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండిపడుతుంది. 2022–23 సంవత్సరానికి సంబంధించి జడ్చర్లకు కేవలం రూ.34 వేలు మాత్రమే ఆదాయం వచ్చిందంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు. అవి కూడా వ్యాపార ప్రకటనలకు సంబంధించి ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ల నుంచి మాత్రమే ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు.

చర్యలు చేపడుతాం..



మున్సిపాలిటీలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి. చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేయడం సరికాదు. నిర్ణీత రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేస్తాం.

– మహ్మద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

మహమ్మదాబాద్: ఉమ్మడి గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో విద్యుత్ సరఫరా లేక గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి. దీనిపై సాక్షి దినపత్రికలో 'నిర్లక్ష్యమే వారికి శాపం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు బుధ, గురువారం నుంచి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. గాధిర్యాల్, గుప్పోనికుంట, బోరింగ్‌తండా, మదిరెమీదితండా, ఎన్కిచెర్వు, బోయగుడిసెలు, జగ్గంపల్లికి ప్రస్తుతం విద్యుత్ అంతరాయం కలగకుండా లైను సరిచేసేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు ఏఈ శ్రీకాంత్ తెలిపారు.


కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

పెద్దగుట్టపై చిరుత సంచారం


గుట్టపై ఉన్న గుండుపై కనిపిస్తున్న చిరుత పులి

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది శివారులోని పెద్ద గుట్టపై చిరుత సంచారం కలకలం రేపుతోంది. వేములకి చెందిన గొర్రెల కాపరి ఆంజనేయులు తన గొర్రెలను గుట్ట పరిసరాల్లో మేపుతుండగా.. గురువారం సాయంత్రం నీటి కోసం గుట్ట సమీపంలోకి వాటిని తీసుకెళ్లాడు. గుట్టపై ఉన్న చిరుత గొర్రెల మంద వరకు వచ్చి వాటిపై దాడి చేసింది. ఓ గొర్రె మెడను నోట కరుచుకుని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా.. గమనించిన కాపరులు అరుపులు, కేకలు వేయడంతో చిరుత దాన్ని వదిలేసి గుట్టపైకి వెళ్లిపోయింది. కొంతసేపటి తర్వాత గుట్టపై ఉన్న ఓ గుండుపై చిరుత కనిపించడంతో గొర్రెల కాపరులు, గుట్ట పరిసరాల్లో పొలాలు ఉన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా జూన్ 27న ఇదే గుట్టపై సంచరిస్తున్న చిరుత పులి తుంకినీపూర్ శివారులోని పొలాల్లో రైతులకు కనిపించింది. తాజాగా మరోసారి గుట్టపై చిరుత సంచారం రైతులు, కాపరులకు నిద్ర లేకుండా చేస్తోంది. వేముల రోడ్డు పక్కనే ఉన్న ముత్యం గుండు పరిసరాల్లో చిరుత సంచారం ఎక్కువైనట్లు తెలుస్తోంది. కాగా గుట్ట సమీపంలోని పొలం యాజమాని కెెకె.రజినిసాగర్ ఫోన్‌లో డీఎఫ్ఓకు ఫిర్యాదు చేసి చిరుతను బంధించేలా చర్యలు చేపట్టాలని కోరగా.. తమ సిబ్బందిని పంపించి పరిశీలిస్తామని తెలిపినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. గుట్ట పక్కనే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉండటంతో అందులో ఉండే బాలికలు సైతం ఆందోళనకు గురవుతున్నారు. చిరుతను బంధించి తీసుకెళ్లాలని సంకలమద్ది, వేముల, తుంకినీపూర్, చక్రాపూర్, జానంపేట గ్రామాల రైతులు కొన్నాళ్ల నుంచి కోరుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.


చిరుత దాడిలో గాయపడిన గొర్రెను చూపుతున్న కాపరి

పింఛన్లు కాజేశారని లబ్ధిదారుల ఆరోపణ


చౌడూర్ పంచాయతీ కార్యాలయంలో బీపీఎంతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

- బీపీఎం నిర్బంధం

నవాబుపేట: పింఛన్లు సరిగా ఇవ్వకుండా కాజేశారని బీపీఎంను గ్రామస్తులు, లబ్ధిదారులు నిర్బంధించారు. గురువారం మండలంలోని దేపల్లిలో పింఛన్లు అందించే బీపీఎం చెన్నయ్యను గ్రామస్తులు పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. తమ పింఛన్లు నెలల తరబడి సంతకాలు, వేలి ముద్రలు వేసుకుని ఇవ్వలేదని వాపోయారు. రెండు కిలోమీటర్ల నడిచి వెళితే కూడా కనికరం లేకుండా వేలి ముద్ర తీసుకుని పింఛన్ ఇవ్వలేదని గ్రామస్తులు వివరించారు. గ్రామంలో 128 పింఛన్లు ఉండగా వాటిలో ఎక్కువగా వృద్ధాప్య ఉన్నాయని, వృద్ధులు ప్రతి నెల నడిచి చౌడూర్ వెళ్తున్నా ఇవ్వడం లేదని వాపోయారు. చౌడూర్‌కు చెందిన బీపీఎం చౌడూర్‌తో పాటు కాకర్‌జాల్, దేపల్లి, కాకర్‌జాల్‌తండాలకు పింఛన్లు అందించాల్సి ఉంది. కానీ కేవలం చౌడూర్‌లో ఉండి అందరిని అక్కడికి రమ్మంటూ, మూడు నెలలుగా పింఛన్ డబ్బులు కాజేస్తున్నాడని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ దేపల్లి గ్రామస్తులు బీపీఎంను నిర్బంధించి పెట్టారు. గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ కాజేసిన పింఛన్లు లబ్ధిదారులకు ఇవ్వాలని, అలాగే కొత్త బీపీఎంను దేపల్లికి నియమించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రాజేందర్‌రెడ్డికి సమాచారం అందించారు. కాగా బీపీఎం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులకు తహసీల్దార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మనుస్మృతి కోసమే ఉమ్మడి పౌరస్మృతి బిల్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం దేశంలో యుగాలకాలంనాటి మనుస్మృతి అమలు చేయడానికే ఉమ్మడి పౌరస్మృతి బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆలోచన చేస్తుందని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ముస్లింల జీవన విధానాన్ని పూర్తిస్థాయిలో కష్టాల్లో నెట్టే కుట్ర దీని వెనక దాగున్న అసలు రహస్యం అని పేర్కొన్నారు. వాస్తవానికి ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందితే భారత రాజ్యాంగం ప్రమాదం పడటం ఖాయమని ఫలితంగా విభిన్న సంస్కృతుల, సంప్రదాయాలను అనుసరిస్తున్న ఆదివాసులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలలోని వందల జాతుల మనోభావాలు దెబ్బతింటాయని తెలిపారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కేంద్రానికి భయపడి బిల్లుకు మద్దతు తెలిపితే వారి ఉనికికే ప్రమాదమని గ్రహించాలని ఆయన కోరారు.

టుడే లీగ్‌లో ఎండీసీఏ జట్టు భారీ స్కోర్

- 5 వికెట్లకు 457 పరుగులు చేసిన జట్టు
- సెంచరీలు చేసిన అబ్దుల్ రాఫే, కిషోర్


అబ్దుల్ రాఫే


కిషోర్

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ బీ–డివిజన్ టూడే లీగ్ చాంపియన్‌షిప్‌లో గురువారం జిల్లా జట్టు తన మూడో మ్యాచ్‌లో బాలాజీ కోల్ట్ జట్టుపై భారీ స్కోర్ చేసింది. మొదటి రోజు తొలుత బ్యాటింగ్ చేసిన ఎండీసీఏ జట్టు నిర్ణీత 85 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 457 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫే, కిషోర్‌లు సెంచరీలతో రాణించారు. అబ్దుల్ రాఫే 135 పరుగులు (180 బంతుల్లో 21 ఫోర్లు), కిషోర్ 101 పరుగులు (135 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), హర్షవర్ధన్ 70 పరుగులు, శ్రీకాంత్ 50 పరుగులు చేయగా.. కాశీం 61 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. శుక్రవారం రెండో రోజు మ్యాచ్ కొనసాగనుంది.

పాముకాటుతో రైతు మృతి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే గువ్వల


తిరుపతయ్య (ఫైల్)

వంగూర్: పాముకాటుకు గురై రైతు తిరుపతయ్య (50) మృతి చెందిన సంఘటన మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గురువారం ఉదయం తిరుపతయ్య తన వ్యవసాయ పొలానికి వెళ్లి పనుల్లో నిమగ్నం కాగా పాము కాటువేసింది. దీంతో వెంటనే అతను ఇంటికెళ్లి ఈ విషయాన్ని భార్యకు చెప్పాడు. అనంతరం అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు 108లో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించి, ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందించారు. తిరుపతయ్యకు భార్య బాలమణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పాముకాటుకు చెట్టు మందు పోసేవాడికే ఇలా..

తిరుపతయ్య పాముకాటుకు గురైన వారికి ఎంతో మందికి చెట్టు మందు పోసి ప్రాణాలు కాపాడాడు. అలాంటి వ్యక్తి పాముకాటుతో మృతి చెందడంతో పలువురిని కలిచివేసింది. ఈ విషయం తెలిసిన వెంటనే గాజర, తిరుమలగిరి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున మృతదేహాన్ని చూడటానికి వచ్చారు.

జడ్చర్ల బస్టాండ్‌ను సందర్శించిన సీటీఎం


బస్టాండ్ ప్రాంగణంలో డీఎంతో మాట్లాడుతున్న సీటీఎం

జడ్చర్ల టౌన్: ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (సీటీఎం) కుస్రోషాఖాన్ గురువారం పట్టణంలోని బస్టాండ్‌ను సందర్శించారు. ఆయనకు బస్టాండ్ వద్ద మహబూబ్‌నగర్ డీఎం సుజాత, డిప్యూటీ ఆర్ఎం శ్యామల స్వాగతం పలికారు. బస్టాండ్ ద్వారా వచ్చిపోయే బస్సుల వివరాలు, రికార్డులు, బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. బస్టాండ్ పరిస్థితులపై ఆయన డీఎం, డిప్యూటీ ఆర్ఎంలను అడిగి తెలుసుకున్నారు. బస్సులు నిర్ణీత సమయాల్లో వచ్చి వెళ్తున్నాయా అన్న వివరాలు, ప్రయాణికుల రద్దీ, వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. బస్సుల్లో కండక్టర్ల వ్యవహరించే తీరును ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో దుకాణాలు, వాటి ద్వారా వచ్చే ఆదాయం వివరాలను విచారించారు. మరింత ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్గో కేంద్రం పరిశీలించి బుకింగ్స్, డెలివరీలు ఎలా ఉన్నాయని విచారించారు. ఆయన వెంట ఆర్టీసీ అధికారి కల్యాణి రాగా స్థానిక కంట్రోలర్ బాలస్వామి ఇతర అధికారులున్నారు.

పరిశ్రమల కాలుష్యం వల్లే రోగాలు

- గాంగె మినరల్స్ విస్తరణపై చర్య తీసుకోవాలి
- జిల్లా అడిషనల్ కలెక్టర్ సీతారామారావు సమక్షంలో అభిప్రాయ సేకరణ


ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, ఈఈ సంగీత

బాలానగర్: మండల కేంద్రంలోని పరిశ్రమల కాలుష్యం వల్ల రోగాల బారిన పడుతున్నామని ప్రజలు పేర్కొకన్నారు. గాంగె మినరల్స్ పరిశ్రమ విస్తరణపై వెంటనే చర్యలు తీసుకోవాలని గురువారం ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన జిల్లా అడిషనల్ కలెక్టర్ సీతారామారావుకు డిమాండ్ చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గ్రామస్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శివారులోని పరిశ్రమ విస్తరణ చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలానగర్ సర్పంచ్ విజయలక్ష్మి పరిశ్రమ విస్తరణపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉన్న పరిశ్రమ కాలుష్యంతోనే ఇబ్బందులు పడుతున్నామని, గ్రామ విస్తరణకు, అభివృద్ధికి పరిశ్రమ అడ్డంకిగా మారిందన్నారు. పరిశ్రమ పరసరాల్లో భూములు ధరలు పెరగక, పంటలు పండక రైతులు నష్టపోతున్నారన్నారు. బాలానగర్, గౌతాపూర్ పరిసరాల్లోని పరిశ్రమల్లో భారీ బ్లాస్టింగ్స్ చేయడం వల్ల సమీపంలోని బాలానగర్, అమ్మపల్లి గ్రామంలో ఇండ్లు బీటలువారుతున్నాయన్నారు. పరిశ్రమకు వచ్చే భారీ వాహనాలు అనుమతికి మించి బరువులతో రాకపోకలు సాగించడంతో రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. అమ్మపల్లి గ్రామ యువకుడు పుట్టల మహేష్ మాట్లాడుతూ పరిశ్రమకు అనుకుని తమ భూములున్నాయని, పండించిన పంటలపై తెల్లటి దూళి చేరడంతో లక్షలు పెట్టి తెచ్చిన ఆవులు మరణించాయన్నారు. పరిశ్రమ గ్రామానికి 100 మీటర్లలోపే ఉందని, ఇలాంటి పరిశ్రమతో భవిష్యత్‌కు ఇబ్బందేనని చింతగూడ గ్రామానికి చెందిన రాములు అన్నారు. పరిశ్రమ ద్వారా వచ్చిన సీఎస్ఆర్, డీఎంఎఫ్ ఫండ్ ద్వారా గ్రామానికి ఏమి అభివృద్ధి చేశారని మాజీ డిప్యూటీ సర్పంచ్ జంగయ్య ప్రశ్నించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ సంగీత, మైనింగ్ ఏడీ విజయ్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కృష్ణారావు, పలువురు ఎన్జీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత



కృష్ణా: మండల సరిహద్దులో గల చెక్‌పోస్టులో గురువారం ఎక్సైజ్ చెక్‌పోస్టు అధికారులు, స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో గోవా నుంచి తీసుకొచ్చిన 14 మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.

శవమై కనిపించిన తప్పిపోయిన వ్యక్తి


నాగన్న(ఫైల్)

గోపాల్‌పేట: నలబైరోజుల కిందట తప్పిపోయిన వ్యక్తి గుట్టల్లో ఉరేసుకుని మృతిచెంది కనిపించాడు. గోపాల్‌పేట ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రేకులపాడు నాగన్న(58) సుమారు నలబై రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కనిపించక పోవడంతో మే 30న గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల కిందట తాడిపర్తి గుట్టల్లో మనిషి చనిపోయిన వాసన వస్తుందని గొర్రెలకాపర్లు చెప్పడంతో ఎస్ఐ, కొందరు యువకులతో కలిసి వెళ్లి గుట్టల్లో చూశారు. ఓ పాము చనిపోయి మురిగిపోయిన వాసన వస్తుండటంతో అప్పుడు ఇది కాదని తిరిగి వచ్చారు. మంగళవారం తాడిపర్తి గొర్రెలకాపర్లు తాడిపర్తి గట్లలో కాదు గోపాల్‌పేట రామన్‌పాడ్ పంప్‌హౌస్ ఎదురుగా గట్టుమీద శవం ఉందని చెప్పారు. గోపాల్‌పేటకు చెందిన కొందరు యువకులు గురువారం వెళ్లి చూడగా.. తాడిపర్తి శివారులోని మంగళలోని లొంకగుట్టల్లో ఉరేసుకుని తల, మొండెం విడిపోయి కిందపడిపోయిన స్థితిలో మృతదేహం కనిపించింది. దీంతో యువకులు పోలీసులకు సమాచారం అందించగా.. అక్కడికి చేరుకున్న ఎస్ఐ మిస్సింగ్ అయిన నాగన్న కుటుంబ సభ్యులను పిలిపించి చూపించారు. మృతదేహం నాగన్నదే అని తన భార్య బాలనాగమ్మ గుర్తించింది. అక్కడే పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ తెలియజేశారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


బాలకృష్ణ (ఫైల్)

కోడేరు: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి బాలకృష్ణ(22) కొన్ని రోజులుగా బ్రేయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూత

- రాష్ట్ర చేనేత, జౌళీ శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్


వెల్టూర్‌లో మాట్లాడుతున్న చేనేత, జౌళీ శాఖ కమిషనర్ బుద్ధ ప్రసాద్

కొత్తకోట రూరల్: రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూతనిస్తోందని రాష్ట్ర చేనేత, జౌళీశాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్ అన్నారు. గురువారం పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో చేనేత, జౌళీ శాఖ జోగులాంబ గద్వాల వారి ఆధ్వర్యంలో చేనేత కార్మికులు సమావేశమయ్యారు. ఆ శాఖ కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేనేత కార్మికులకు వేతనాలతో పాటు 50ఏళ్లు పైబడిన వారికి ఆసరా పింఛన్లు, బీమా, సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులందరికీ ఉపాధి కల్పించేలా ప్రభుత్వం ఆలోచిస్తుందని, అలాగే వేతనాలు పెంచనున్నదని తెలిపారు. సొసైటీల దగ్గర ఉన్న స్టాక్‌ను టెస్కో అధికారులు కొనుగోలు చేయాలని, ముడి సరుకులకు ప్రభుత్వం ఎక్కువగా నిధులు మంజూరు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చేనేత కార్మికుల మగ్గాలను పరిశీలించారు. కార్యక్రమంలో గోవిందయ్య, బుచ్చప్ప, కళింగారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

రామన్‌పాడు నీటిలో మృతదేహం లభ్యం

మదనాపురం: తిరుమలపల్లి శివారులోని రామన్‌పాడ్ బ్యాక్ వాటర్‌లో మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రామన్‌పాడు గ్రామానికి చెందిన నల్లబోతుల చెన్నయ్య (51) మంగళవారం పశువులకు నీళ్ల తాపడానికి వెళ్లి రామన్‌పాడు డ్యాములో మిస్సయ్యాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం తిరుమలపల్లి శివారులోని రామన్ పాడు బ్యాక్ వాటర్‌లో మృతదేహం తేలింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలిపారు. ఈత రాకపోవడం వల్ల కాలుజారి నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చెన్నయ్య కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు.